
కథ



# హేపీ న్యూ ఇయర్

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

"మీ న్యూ ఇయర్ రిజల్యూషన్ నేను కోరుకోనా?" అడిగింది శారద భర్తని.

"వై నాట్? " అంగీకరించాడు గిరి.

శారద లేచి గిరి దగ్గరకి వెళ్లి, అతని కుడిచేతి మణికట్టుని తన అరచేత్తో పట్టుకుంది.

"చూసారా? నా వేళ్లు కలుసుకోవడం లేదు" చెప్పింది.

తన భర్త చూపులనిబట్టి తను చెప్ప దలచుకున్న పాయింట్‌ని గ్రహించలేదని గుర్తించి వివరించిందామె.

"పూర్వం మీ మణికట్టు పట్టుకుంటే నా వుంగరం వేలు, బొటనవేలు ఒక దానికొకటితాకేవి. ఇప్పుడు కనీసం మధ్య వేలుకూడా నా బొటనవేలుని తాకలేకపోతోంది. ఏమిటి దానర్థం?"

"రోజుకి మేన్షన్ హౌజ్ బ్రాంది మూడు పెగ్స్ ప్లస్ డబల్ ఎగ్ ఆమ్లెట్ అని అర్థం" నవ్వాడు గిరి.

"నేనేం మల్లాది సుబ్బమ్మని కాను మీ అలవాట్లు మానమనడానికి. బట్, రోజూ వుదయం ఓ అరగంట జాగింగ్ చెయ్యరాదా? మూడు నెలల్లో వంట్లోని కొవ్వు మొత్తం కరిగిపోతుంది."

"బరువు తగ్గాలనే ఆలోచన నాకు చాలాకాలంగా వుంది."

"ముప్పయి అయిదు దాటాక బరువు తగ్గడం కష్టంట. ఈ న్యూ ఇయర్‌లో మీరు మళ్లీ సంవత్సరం క్రితం బరువుని సాధించండి. అదే మీ న్యూ ఇయర్ రిజల్యూషన్. ఏం?" అడిగింది శారద.

"డన్" వప్పుకున్నాడు గిరి.

ఆ తర్వాత ఇద్దరూ తామివ్వాలనుకున్న పార్టీ గురించి చర్చించుకున్నారు, డిసెంబర్ 31న లేక జనవరి 1 నా అని. తమ కొడుకు ఛామంత్ పుట్టినప్పుడు ఇచ్చిన పార్టీ తప్ప తర్వాత బంధుమిత్రులకు మళ్లీ పార్టీ ఇవ్వలేదు. ఆ ఆలోచనవున్నా, సరైన కారణం ఆ ఇద్దరికీ దొరకలేదు.

"డిసెంబర్ తర్టిఫస్ట్ రాత్రి ప్రతీవాళ్ళకి ఏదో ఓ ప్రోగ్రాం వుండకతప్పదు. జనవరి ఫస్ట్ బెటర్" చెప్పింది శారద.

అది గిరికికూడా నచ్చింది.

జనవరి ఒకటి రాత్రి ఏడున్నరకి హోటల్ రెసిడెన్సీలో ముప్పయిమందికి పార్టీకోసం ఏర్పాట్లు పూర్తి చేసాడు గిరి.

ఆ సంవత్సరం ఆఖరు తేదీన, ఆఖరి గంటలు శారద, గిరి టి.వి.ముందు ఇంట్లోనే గడిపారు,బయటికి వెళ్లకుండా.

కౌంట్‌డౌన్ స్టార్ట్ అయి న్యూ ఇయర్ రాగానే ఇద్దరు ఒకరికొకరు 'హేపీ న్యూ ఇయర్' చెప్పుకున్నారు. ఛామంత్ గాఢ నిద్రలో వున్నాడు అప్పుడు.

*** ***

మర్నాడు వుదయం గిరి ఆరున్నరకే నిద్రలేచి, బాత్‌రూంలోకి వెళ్లి వచ్చాక కొత్తగా కొన్న జీన్స్ షార్ట్‌ని, జాగింగ్ షూస్‌ని ధరించాడు. శారద అతనికి వేడి వేడి బ్లాక్ టి కప్పు అందించి చెప్పింది.

"మధ్యలో డిస్‌కంటిన్యూ చేయకూడదు."

"నీ మీదొట్టు. సరేనా? నెలతర్వాత నా వెయిట్ చూసాక నీకే తెలుస్తుంది."

బ్లూ రంగు మారుతీ కారు ఎక్కి గిరి స్టార్ట్ చేసాడు. అతని కారు తనింటికి కిలో మీటరున్నర దూరంలో వున్న ఖాళీస్థలం దగ్గర ఆగింది. అక్కడికి అతనిలా వచ్చిన అనేక మంది వాకింగ్, జాగింగ్, స్కిప్పింగ్ అక్కడక్కడా చేస్తున్నారు. అందరి కార్లు వరసగా రోడ్డుకి ఓ పక్కన పార్క్ చేసి వున్నాయి. అది జూబ్లీ హిల్స్‌లోని ఓ భాగం కాబట్టి టూ వీలర్స్ మచ్చుకి ఒక్కటికూడా లేదు.

*** ***

గిరి విడిచిన జీన్స్ ప్యాంట్స్‌ని పని మనిషి వాషింగ్ మెషీన్‌లో వేయబోతూ దాని జేబులోవున్న పేజర్‌ని తీసి శారదకిచ్చింది. రేపట్నించి తన భర్తని, దాన్ని మర్చిపోకుండా వెంట తీసుకెళ్లమని చెప్పాలనుకుంది ఆమె.

*** ***

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కి ఆ కబురందగానే ఓ ఎస్.ఐ. ఓ కానిస్టేబుల్ స్కూటర్‌మీద అక్కడికి చేరుకున్నారు. ఎక్సర్‌సైజ్ చేయడానికి వచ్చిన వాళ్లంతా ఓ చోట గుమిగూడి చూస్తున్నారు. వాళ్ల వైపు నడిచాడు.

నేలమీద పడివున్న ఆ యువకుడ్ని చూశాడు ఎస్.ఐ- వంగి పల్స్ చూసాడు. గుండెమీద చెవి ఆనించి విన్నాడు. ముక్కుముందు వేలుంచి చూసాడు.

"పోయాడు. ఆర్టిఫీషియల్ రెస్పిరేషన్ని ట్రయ్ చేసాను. కాని రివైవ్ కాలేదు." చెప్పాడు ఓ ఏభై ఏళ్లాయన విచారంగా.

"మీరు డాక్టరా?" అడిగాడు ఎస్.ఐ అతన్ని పరీక్షగా చూసి.

"అవును. మాసివ్ హార్ట్ అటాక్ అని నా ప్రాథమిక పరిశీలనని బట్టి చెప్పగలను."

"ఇతని పేరేమిటి?"

ఎవరూ మాట్లాడకపోవడంతో అడిగాడు ఎస్.ఐ.మళ్లీ.

"ఇతనెవరో మీలో ఎవరికైనా తెలుసా?"

అంతా మౌనంగా వుండటంతో అడిగాడు అతనే మళ్లీ.

"ఇతను రోజూ వస్తుంటాడా?"

"ఊహు. ఇవాళే మొదటిసారిలా వుంది." చెప్పాడా డాక్టర్.

ఎస్.ఐ. సౌంజ్ఞని అర్థంచేసుకుని కానిస్టేబుల్ ఆ శవానికివున్న జీన్స్ షార్ట్ జేబులు తణిఖీ చేసి, ఓ తాళం చెవుల గుత్తి, బిల్ ఫోల్డర్ బయటికి తీసాడు. అందులో నాలుగువందల పన్నెండు రూపాయలు తప్ప విజిటింగ్ కార్డులాంటివేమీ లేవు. తాళం చెవులని చూసి అవి కారు తాళం చెవులుగా గుర్తించాడు ఎస్.ఐ.

"సో, మీలో ఎవరికీ ఇతను ఎవరో తెలీనట్లేనా?"

సమాధానంకోసం కొద్దిక్షణాలు చూశాక అతను రోడ్డుపక్కన పార్క్ చేసివున్న కార్లవైపు నడిచాడు. అతని వెంట వచ్చిన వాళ్లంతా తమ కార్లేవో చూపించారు కొందరు. వాకింగ్ చేస్తూ దూరంగా వెళ్లిన వాళ్ల కార్లలో ఒక్కోటి ఆ తాళం చెవితో ట్రయ్ చేసాడు ఎస్.ఐ-ఓ బ్లూ రంగు మారుతీ కారు తాళం దాంతో తెరచుకుంది.

ఎస్.ఐ. కారు డ్రయివింగ్ సీట్‌లో కూర్చుని పరిశీలించాడు. లేటెస్ట్ రీడర్స్ డైజెస్ట్ మేగజైన్ వుంది. అంబులెన్స్ వచ్చి డెడ్‌బాడీని తీసుకెళ్లాక ఎస్.ఐ. ఆ మారుతీ కారుని నడుపుకుంటూ వెళ్తే కానిస్టేబుల్ అతని స్కూటర్‌మీద ఆ కారుని పోలీసుస్టేషన్‌కు అనుసరించాడు.

*** ***

"గిరిగారిల్లే ఇది. మీరెవరు?" టెలిఫోన్ రిసీవర్ ఎత్తి సమాధానం చెప్పాక అడిగింది శారద. ఓ కారు నంబర్ చెప్పి అడిగారు అవతలి వాళ్లు.

"అది గిరి కారేనా?"

"అవును. ఇంతకీ మీరెవరు?"

"జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌నించి. మీ వారు వుదయం జాగింగ్‌కి కాని వెళ్లారా?"

"అవును?"

"ఐయాం సారి...."

"ఏమిటి! ఎందుకు సారి? ఏమైంది వారికి? మీరెవరు?"ఆదుర్దాగా అడిగింది శారద.

"ఎస్.ఐ.ని- ఆయన ఎక్సర్‌సైజ్ చేస్తూ హార్ట్ అటాక్‌తో పోయారు."

"ఓ...నో...గాడ్" అరిచింది శారద.

"గాంధీ హాస్పిటల్‌లోని మార్చురికి రండి. నేనక్కడ వుంటాను."

రిసీవర్ పెట్టేసాక శారదకి కాళ్లు చేతు

లు ఆడలేదు. ఏం చెయ్యాలోకూడా తోచ లేదు కాసేపు. గబగబా కిందకి పరిగెత్తు కెళ్లింది. పక్కింటి ఆవిడ చెట్లకి ట్యూబ్‌తో నీళ్లు పోస్తూ శారదని చూసి పలక రింపుగా చెయ్యి వూపింది.

"ఆంటీ. ప్లీజ్ హెల్ప్‌మి" అరిచింది శారద కీచు గొంతుతో.

ఆవిడ పరిగెత్తుకొచ్చి ఏడుస్తున్న శారదని అడిగింది.

"ఏమైంది బేబి? ఏం జరిగింది?"

శారద ఏడుపు మధ్య ఫోన్ కాల్ గురించి చెప్పింది. ఆవిడే స్వయంగా శార ద ఇంటి తాళం చెవులు వెదికి తీసుకుని, ఛామంత్‌కి బట్టలు మార్చి, ఫ్రంట్ డోర్ లాక్ చేసింది. ఈలోగా ఆవిడ భర్త కారు బయటకి తీసారు. నలుగురూ ఎక్కిన ఆ కారు గాంధి హాస్పిటల్‌లోని మార్చురీ సెక్షన్‌కి నలభై నిమిషాల తర్వాత చేరుకుంది. యూనిఫాంలోవున్న ఎస్.ఐ. దగ్గరకి నడిచాడాయన.

వాళ్లిద్దరు మాట్లాడుకున్నాక ఎస్.ఐ. ఇచ్చిన రీడర్స్ డైజెస్ట్ మేగజైన్‌ని తెచ్చి ఆయన శారదకి చూపించి అడిగాడు.

"ఇది మీ వారిదేమో చూడమంటు న్నాడు"

శారద దానివంక చూసి తలవూపి చెప్పింది ఏడుస్తూ.

"సబ్‌స్క్రైబర్స్ కాపీ. మావారికి నిన్ననే పోస్టులో వచ్చింది."

"రండి. బాడీని ఐడెంటిపై చెయ్యాలి"

ఛామంత్‌ని ఎత్తుకుని ఎస్.ఐ.వెంట నడిచింది శారద. ఆమెను అనుసరిస్తున్న ఆంటీ చెయ్యి పట్టుకుని ఆపి చెప్పాడు ఆంటీ భర్త.

"నువ్వొద్దు. నీకసలే బి.పి"

తెల్లటి దుప్పటి తెరవగానే శారద జాగింగ్ షూస్‌ని, జీన్స్ పాంట్‌ని, టి.షర్ట్ ని చూసింది. టి షర్ట్‌మీద లిప్ స్టిక్ ముద్ర-పెదవుల ముద్ర-ని చూడగానే షాకయింది శారద-అది ఎవరిదై వుంటుంది? ఛామంత్ టీచర్ ఒక్కతే తనకు తెలిసి లిప్‌స్టిక్ వాడేది.

దుప్పటిని మూసేసి బయటకి నడిచా డు ఎస్.ఐ.

"అదిగో. అక్కడ టెలిఫోన్ బూత్ వుంది. కావాల్సిన వాళ్లకి ఫోన్లు చేయం డి." అనునయంగా చెప్పాడతను.

తల్లి ఎందుకు ఏడుస్తుందో అర్థంకాని ఛామంత్‌కూడా ఏడవసాగాడు.

*** ***

గిరి గేటు తెరచుకుని లోపలకి వచ్చా డు. ఇంటికి వేసి వున్న తాళం చూసి విభ్రాంతి చెందాడు. శారద ఎక్కడికి వెళ్లి నట్లు? తెలుసుకోవడానికి పక్కింటి ఆంటి వాళ్లింటికి వెళ్తే అదీ తాళంవేసి వుంది. వాళ్ళ కారుకూడా లేదు.

జేబులోంచి తాళం చెవుల గుత్తితీసి తనింటి తాళం తెరచుకుని లోపలకి వెళ్లా డు. సరాసరి ఫోన్ దగ్గరకి వెళ్లి జూబ్లీహి ల్స్ పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేసాడు.

"నా కారుని ఎవరో దొంగిలించారు. రిపోర్ట్ చేయడానికి ఫోన్ చేసాను." చెప్పా డు అవతలివైపు రిసీవర్ ఎత్తగానే.

"ఫోన్‌లో కాదు. స్వయంగా రండి." చెప్పి లైన్ కట్ చేసారవతలివైపు.

"డామిట్. న్యూ ఇయర్ మొదటిరోజే ఇలా జరగటం ఏమిటి?" అనుకున్నాడు గిరి. ఫోన్ మోగింది రిసీవర్ అందుకుని చెప్పాడు.

"హలో"

"శారదగారున్నారా?"అడిగిందో మగకంఠం.

"లేదు. మీరెవరు?"

"బేంక్ మేనేజర్‌ని. పాపం. గిరిగారు పోయారన్న వార్త తెలిస్తే పరామర్శిద్దామ ని ఫోన్ చేసాను."

"నేను పోవడమేమిటి? గిరిని మాట్లా డేది. నేను పోయానని ఎవరన్నారు?" విస్మయంగా అడిగాడు గిరి.

"గాంధి హాస్పిటల్‌నించి ఫోన్ వచ్చింది ట మా కస్టమర్ అయిన మీ మామ గారి నుంచి...పొరపాటు పడ్డాను...శారద గారికే హార్ట్ అటాక్ వచ్చి వుండాలి. చాలా మందికి ఫోన్‌లు వెళ్లాయట."

"శారదకి హార్ట్ అటాకా?" అదిరి పడ్డాడు.

"అవును. బాడీని గాంధీ హాస్పిటల్‌లో వుంచారట. పోస్టుమార్టం కాకుండా బాడీ ని తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారట."

గిరి కాళ్లు వణికాయి. శారదని తీసుకు ని పక్కింటి ఆంటివాళ్లు హాస్పిటల్‌కి వెళ్లుంటారు బహుశా పొద్దుటిదాకా ఆరో గ్యంగా వుందే? రిసీవర్ క్రెడిల్‌మీద వుం చాలన్న స్పృహకూడా లేకుండా సోఫామీ ద పడేసి బయటికి పరిగెత్తాడు గిరి.

*** ***


దారిపొడుగునా గిరి గుండెలు పగిలే లా ఏడుస్తూనే వున్నాడు. అతణ్ణి సము దాయించడం అతని మిత్రుడి వశంకావ డంలేదు.

"శారదా... నా శారద లేకుండా నేనెలా బతకగలను" అన్న మాటలే గిరినోటివెం ట పదేపదే వెలువడుతున్నాయి.

గాంధి హాస్పిటల్ మార్చురీ సెక్షన్ బయట ఆగింది కారు. దూరంగా నిలబ డి వున్న గుంపులోని అందర్ని కారులోం చే గుర్తుపట్టారు గిరి, అతని ఫ్రెండ్.

"మీ మామయ్య,మరదలు, మీ అన్న య్య.అంతావున్నారు...నిజమే అయితే" చెప్పాడు ఫ్రెండ్.

గిరి తలుపు తెరచుకుని దిగి గబ గబా వాళ్లవైపు నడుస్తూ అడిగాడు ఏడుస్తూ.



బొమ్మలు : పాండు

"ఏమైందసలు శారదకి? ఎలా పోయింది? "

ఆ గొంతు విని గిరుక్కున వెనక్కి తిరిగి, పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వస్తున్న గిరివంక కళ్లింత చేసుకుని చూసింది శారద.

"ఓ మైగాడ్. వచ్చేది ఆయనేగా. అంటే ఆ యన పోలేదా?" ఆనందంగా అరిచింది. అంతా గిరివంక విభ్రాంతిగా చూడసాగారు.

పరిగెత్తుకెళ్లి గిరిని కావలిం చుని అతని వళ్లంతా తడుము తూ వెక్కి వెక్కి ఏడుస్తూ, అం తలోనే నవ్వుతూ చెప్పింది.

"మీరు బతికే వున్నారా! ఐయాం సో హాపీ..."

"నేను పోవడమేమి టి? నువ్వు పోయా వని బ్యాంక్ మేనే జర్ చెబితేను."

అయోమ యంగా చెప్పా డు గిరి.

జ రిగేది చూస్తున్న ఎస్.ఐ.టోపీ తీసి బుర్ర గోక్కున్నాడు ఓసారి. తర్వాత మార్చురివైపు ప్రశ్నార్థకంగా చూసాడు.

*** ***

ఆ రాత్రి హోటల్ రెసిడెన్సీలో జరిగిన పార్టీలో ఎప్పటికన్నా సంతోషంగా వున్నారా జంట. జరిగింది ఆహుతులకు వివరించారు భార్యాభర్తలిద్దరూ.

"నేను ఇరవై నిమిషాలసేపు జాగింగ్ చేస్తూ వెళ్లాను. ఈలోగా ఏం జరిగిందో తెలీదు. తిరిగి వచ్చాక చూస్తే నా కారు కనపడలేదు. నడుచుకుంటూ ఇంటికి వెళ్లాను." చెప్పాడు గిరి.

"హార్ట్ అటాక్‌తో పోయినతని జేబులో ని తాళం చెవి మా వారి కారుకి ఎంతో కాకతాళీయంగా పట్టడంతో వచ్చింది అసలు ట్రబుల్. దాని పక్కనున్న చాక్ లెట్ రంగు కారు యజమాని నిజానికి పోయింది. ఎత్తు, బరువు, ఆఖరికి వంటిమీది కొత్త బూట్లు, డ్రస్‌కూడా అచ్చం మా వారు తొడుక్కున్నలాంటివే ఆ పోయినతనివికూడా. మార్చురీలో వాటిని చూసి మావారేననుకున్నాను మొహంచూ దకుండానే. దుప్పటి మళ్లీ కప్పేసారు. మొహం ఎందుకు చూడలేదంటే తెల్లటి టి.షర్ట్‌మీద లిప్‌స్టిక్ మరకలుంటే అవి ఎవరివా అని చూస్తుండి పోయాను." చె ప్పింది శారద నవ్వుతూ.

"నాలా న్యూ ఇయర్ రిజల్యూషన్‌తో జాగింగ్ మొదలెట్టాడు పోయిన శ్యామ్ సుందర్, నాలా అన్నీ కొత్తవి కొనుక్కుని. ఇంటికొచ్చాక బేంక్ మేనేజర్ ఫోన్ చేసారు. నేను పోలేదని తెలుసుకుని పోయింది మా ఆవిడ అని సొంత తెలివి తేటలతో వూహించి చెప్పాడు. దాంతో నేను..." మిశ్రమభావాలతో గిరి గొంతు గద్గదంగా ఆగిపోయింది.

ఆంటీ చెప్పింది.

"మీ ఇద్దరూ ఓ పార్ట్‌నర్ మరణిస్తే ఇంకో పార్ట్‌నర్ చెప్పలేని విషాదం అను భవించి, అది అబద్ధమని తెలుసుకు న్నాక అంతకు రెట్టింపు ఆనందం కొద్ది గంటల తేడాలో అదేరోజు అనుభవిం చారు.ఇది అందరికీ జరిగే సంఘటన కాదు. అలాంటి ఆనందం పొందిన మీ ఇద్దరూ అదృష్టవంతులు."

"నిజమే. నూతన సంవత్సరం లోని చెడంతా మీ ఇద్దరికీ ఈ సంఘటనలతో కొట్టుకుపోయాయి. లెట్స్ సెలబ్రేట్." చెప్పాడు శారద తండ్రికూడా.

గిరి చేతిని తన చేతిలోకి తీసుకుని ప్రే మగా, గట్టిగా పట్టుకుని చెప్పింది శారద.

"హేపీ న్యూ ఇయర్, అగెయిన్ డార్గింగ్"